సంతోషంగా విహరిద్దాం..!

- సెలవుల్లో విహార యాత్రలకు వెళ్తున్నారా..
- పర్యాటక ప్రాంతాల పర్యటనలకు ప్రణాళికలు తప్పనిసరి
- చిన్నపాటి జాగ్రత్తలతో యాత్రలు విజయవంతం
- గుర్తింపు కార్డులు, మెడికల్ కిట్లు వెంట తీసుకెళ్తే మంచిది
- చిన్నారుల జేబుల్లో చిరునామా స్లిప్పులు ఉంచాలి
- ప్రమాదకర ప్రాంతాల్లో సెల్ఫీల జోలికెళ్లొద్దు

వేసవి సెలవుల్లో విహార యాత్రలకు వెళ్లడం సాధారణంగా మారింది. కొందరు కుటుంబ సభ్యులు మాత్రమే వెళ్తుంటారు.. మరికొందరు బంధు మిత్రులతో బృందాలుగా ఏర్పడి ప్యాకేజీలు మాట్లాడుకొని సంతోషంగా గడపడానికి వెళ్తుంటారు. ఉరుకుల పరుగులతో కూడిన యాంత్రిక జీవితానికి సెలవుల్లో కాసింత ఉపశమనం పొందడానికి ప్లాన్ చేసుకుంటుంటారు. సెలవుల్లో సేద తీరడంతో పాటు కొత్త ప్రాంతాలను సందర్శించామనే తృప్తి కలుగుతుంది. సొంత గ్రామాలకు వెళ్లడం.. బంధువుల ఊళ్లకు వెళ్లడం.. పర్యాటక ప్రాంతాలను సందర్శించడం లాంటివి చేస్తుంటారు. విహార యాత్రల్లో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా.. విజయవంతం కావాలంటే తగిన ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అనుసరించడం చాలా అవసరం. యాత్రకు వెళ్లిన వారందరూ వారివారి పరిధిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే యాత్ర ఆనందాల హారంగా మారుతుంది.

– కర్నూలు కల్చరల్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. శ్రీశైలం, రోళ్లపాడు అభయారణ్యం, మంత్రాలయం, యాగంటి, అహోబిలం, ఓంకారం, ఓర్వకల్ రాక్ గార్డెన్స్, బెలుం గుహలు, కొలనుభారతి సరస్వతి ఆలయం, బనగానపల్లె నవాబ్ కోట, మహానంది, ఆదోని కోట, సంగమేశ్వరం, ఓంకారం, కాల్వబుగ్గ, కేతవరం, వాల్మీకీ కేవ్స్, బిల్వసర్గ, కర్నూలు నగర వనం, జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించవచ్చు. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే రాజమండ్రి పాపికొండలు, నాగార్జున సాగర్ డ్యామ్, వేములవాడ, భద్రాచలం, కోటి లింగాల, సోమసిల్ల, యాదగిరి గుట్ట, అరకులోయ, రుషికొండ, భీమిలి బీచ్, బొర్రాగుహలు, అన్నవరం, ద్రాక్షారామం, విజయవాడ కనక దుర్గ ఆలయం, అనంతపురం లేపాక్షి, పుట్టపర్తి, కోటప్ప కొండ, మైపాడ్ బీచ్, బారా షాహిద్ దర్గా, వేలూరు గోల్డెన్ టెంపుల్,ముచ్చింతల్, హైదరాబాద్ బిర్లా టెంపుల్, నెహ్రూ జులాజికల్ పార్క్, ట్యాంక్ బండ్, ముచ్చింతల్ సమతా మూర్తి మందిరం యాత్రికులకు స్వాగతం పలుకుతున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో చాలా మంది సందర్శనీయ స్థలాలను చూసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

సన్నద్ధత ముఖ్యం...

☛ విహార యాత్రలకు వెళ్లేటప్పుడు ఉత్సాహం ఎంత అవసరమో జాగ్రత్త కూడా అంతే అవసరం.

☛ యాత్ర ప్రదేశాలకు సంబంధించిన పూర్తి వివరాలు ముందే తెలుసుకొని సమయం సద్వినియోగం అయ్యేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

☛ వెంట ఫొటో, చిరునామాలతో కూడిన గుర్తింపు కార్డులు తీసుకెళ్లడం మంచిది. ఆపత్కాలంలో వీటి అవసరం పడుతుంది.

☛ స్మార్ట్ ఫోన్లు ఉంటే అందులో నేవిగేషన్ యాప్ ద్వారా మనం వెళ్లే ప్రాంతాలకు దారిని తెలుసుకోవచ్చు. తెలియని ప్రాంతాల మార్గాలను కూడా సులభంగా తెలుసుకోవచ్చు..

☛ కచ్చితంగా ప్రథమ చికిత్సకు సంబంధించిన వైద్య సామగ్రి వెంట తీసుకెళ్లాలి. జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులకు సంబంధించిన మాత్రలను వెంట బెట్టుకుని వెళ్లాలి.

☛ విహారయాత్ర ఎన్ని రోజులు ఉంటుందో ముందే తెలుస్తుంది కాబట్టి అన్ని రోజులకు సరిపడా దుస్తులు తీసుకెళ్లాలి.

☛ పర్యాటక ప్రాంతాలను సందర్శించినప్పుడు వాటి చరిత్రను, అక్కడి విశేషాలను, మధురానుభూతులను డైరీలో రాసుకుంటే అవి జీవితాంతం గుర్తుండి పోతాయి.

☛ విహార యాత్రకు వెళ్తున్నట్లయితే మనకు సంబంధించిన ముఖ్యమైన బంధువులు, స్నేహితులకు తెలియజేయాలి.

☛ చాలా రోజులు యాత్రకు వెళ్తున్నట్లయితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం మంచిది.

☛ ఇంట్లో నగదు, పత్రాలు, బంగారు, వెండి ఇతర విలువైన వస్తువులు ఉంచి వెళ్లకుండా బంధువుల ఇంట్లోగాని, లాకర్‌లోగాని భద్ర పరుచుకోవాలి.

☛ భారీ మొత్తం బంగారం ఆభరణాలతో యాత్రలకు వెళ్లరాదు.

☛ పిల్లలతో అప్రమత్తంగా ఉండాలి. వారి మెడలో విలువైన ఆభరణాలు వేయరాదు. .

☛ సాధ్యమైనంత వరకు విలువైన వస్తువులు వెంట తీసుకోక పోవడం ఉత్తమం. తప్పని పరిస్థితిలో తీసుకెళ్లాల్సి వస్తే వాటికి బీమా చేయించడం మంచిది..



ముచ్చింతల్ సమతా మూర్తి మందిర్



శ్రీశైలం దేవస్థానం

చిన్న చిన్న జాగ్రత్తలతోనే పర్యటన సుఖాంతం

☛ కుటుంబ సభ్యులందరితో పాటు విహార యాత్రకు వెళ్లినప్పుడు ఆ బృందంలో పిల్లలు కచ్చితంగా ఉంటారు. మనం వెళ్లిన ప్రాంతంలో రద్దీ అధికంగా ఉంటే పిల్లల బాధ్యతను ఒక్కొక్కరుగా పంచుకోవాలి.

☛ చిరునామా, సెల్ నెంబర్ వివరాలు ఉన్న చిన్న స్లిప్పులు పిల్లల జేబుల్లో కచ్చితంగా ఉంచాలి.

☛ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకైతే కొంత పరిజ్ఞానం ఉంటుంది. వారికి మన సెల్ నెంబర్, చిరునామా తెలియజేయాలి. అంటే వారు ఒక వేళ ఆ ప్రాంతాల్లో తప్పి పోయినా వివరాలు చెప్పేలా ఉండాలి.

☛ ముఖ్యంగా నదులు, చెరువులు, కోనేర్లు ఉన్న దగ్గర పిల్లలు అప్రమత్తంగా ఉండాలి. ఇష్టానుసారం వదిలేయరాదు. ఎదైనా అనుకోని ఘటన జరిగితే జీవితాంతం బాధ పడాల్సిందే.

☛ నీటి పరివాహ ప్రాంతాలు, కొండలు, లోయలు లాంటి ప్రమాద కర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలి. ఈత కొట్టడం, ఫొటోలు, సెల్ఫీలకు అత్యుత్సాహం ప్రదర్శించరాదు.

☛ ఆహార పదార్థాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పళ్లు, పళ్ల రసాలకు ప్రాధాన్యత ఇవ్వాలి.



మధురానుభూతి మిగలాలి



పర్యాటక స్థలాల సందర్శనతో వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యక్షంగా చూడగలుగుతాం. చారిత్రక ప్రదేశాలు, కట్టడాలను చూడటం వల్ల సాంకేతిక పరిజ్ఞానం ఎలా పరిణతి చెందిందో తెలుస్తుంది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి విహార యాత్రలు చేయడంతో మానసిక వికాసం, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది. క్రమశిక్షణను విస్మరిస్తే ఆపదలు కూడా పొంచి ఉంటాయనే విషయాన్ని గ్రహించాలి. విహార యాత్రకు బయలుదేరినప్పుడు ఎంత సంతోషంగా ఉంటారో తిరిగి వచ్చేటప్పుడు కూడా యాత్ర తీపి జ్ఞాపకాలతో అంతే సంతోషంగా మనం గమ్య స్థానం చేరుకోవాలి.

– డాక్టర్ మండి అన్వర్ హుసేన్, తెలుగు శాఖాధ్యక్షులు, ఉస్మానియా కళాశాల

ప్రత్యేక ప్యాకేజీలతో యాత్రలు



ఏడాదిలో నాలుగైదు ప్యాకేజీలతో టూర్ ఏర్పాటు చేస్తాం. సెలవుల్లో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలకు ప్రత్యేకంగా ప్యాకేజీలతో టూర్స్ వేస్తుంటాం. రెండు మూడు ఫ్యామిలీలు కలిసి ట్రిప్స్ అడుగుతుంటారు. వారి అభిరుచుల మేరకు కోరుకున్న ప్రాంతాలకు, కోరుకున్న వాహనాలను ఏర్పాటు చేస్తుంటాం. యాత్రలకు వచ్చే వారు కోరున్న ఆహార పదార్థాలను తయారు చేసి ఇస్తాం . వెళ్లే ప్రాంతం, వాహనం, ఆహార పదార్థాలకు అనుగుణంగా టూర్ ప్యాకేజి ఉంటుంది. ముఖ్యంగా పుణ్యక్షేత్రాల పర్యటనకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తుంటారు.

– మురళి, టూర్ ఆర్గనైజర్

క్లుప్తంగా

పెరిగిన హుండీ ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల లో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ అమ్మవారి హుండీని సోమవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించినట్లు ఈఓ మోహన్ తెలిపారు. మూలపెద్దమ్మ జాతర సందర్భంగా రెండు నెలలకు రూ.6,00,780 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో చైర్మన్ తలారి చిన్నన్న, ఆలయ సిబ్బంది రాజేష్‌బాబు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం బి.త్రాండపాడులో అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైన బాధిత రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘంజిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బాధిత రైతులతో కలసి ఆయన డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినితిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన పెద్ద బజారి, టీకే శేషన్న, చిన్న బజారి, వేణుగోపాల్,పులేందర్, కె.ధర్మయ్య, టి.శ్రీనివాసుల చొప్ప వాములు ఏప్రిల్ నెలలో అగ్నికి అహుతయ్యాయి. దీంతో ఒక్కో రైతుకు దాదాపు రూ.40 వేల నష్టం వాటిల్లడంతోపాటు పశువులకు గ్రాసం కొరత నెలకొందన్నారు. ఈక్రమంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని ఆయన కోరారు. వారి వెంట సర్పంచ్ బాలపీర ఉన్నారు.

వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్: సబ్సిడీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. సోమవారం ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనాలకు రైతుల పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఏఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు మండలానికి 550 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున పొలాలను దుక్కి దున్ని, ఎరువులు చల్లి సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని, నాణ్యమైన విత్తనాలను విత్తుకోవాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ మల్లేష్‌కుమార్ విత్తన డీలర్లను హెచ్చరించారు. సోమవారం ఆయన సి.బెళగల్లోని నాగశాయి, శివసాయి తదితర దుకాణాల్లో తనిఖీ చేశారు. గతేడాది 750 గ్రాముల పత్తి ప్యాకెట్ ధర రూ.853 ఉండగా, ఈ ఏడాది అంతే పరిమాణం ఉన్న పత్తి ప్యాకెట్ ధర్ రూ.864 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంతకు మించి ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

25న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఈ నెల 25వ తేదీ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. వేసవి సెలవులను పురస్కరించుకొని బైరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి రెండు స్థానాలకు గాను వరుసగా రూ.15 వేలు, రూ.8 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8639924149, 9010810756 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

22 నుంచి చెన్నకేశవస్వామి తిరునాల

ఓర్వకల్లు : మండలంలోని శకునాల గ్రామంలో ఈ నెల 22 నుంచి చెన్నకేశవస్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న తెల్లవారు జామున 5.10 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు కల్యాణమూర్తుల గ్రామోత్సవం, మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు తలముడిపి రామకృష్ణ బృందం వారిచే చెక్కభజన కార్యక్రమం ప్రదర్శన, సాయంత్రం 5 గంటలకు స్వాముల వారి రథోత్సవం ఉంటుందని చెప్పారు. 24వ తేదీన ఉదయం 8గంటలకు ప్రాతఃకాల పూజలు, వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఊపందుకున్న 'ఉపాధి'

- ఉపాధి పనులకు భారీగా కూలీలు
- మండలంలో రోజుకు 4 వేలకు పైగా హాజరు
- వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత
- నగటు కూలీకి కనీస వేతనం రూ.238



పాణ్యంలో కూలీల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీఓ విజయరాణి

పాణ్యం : మండలంలో గత రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం పనులు మరింత ఊపందుకున్నాయి. రోజురోజుకు వేల సంఖ్యలో కూలీలు పనులకు హాజరవుతున్నారు. అంతేకాక ప్రతి రోజు రూ.238 వేతనం పొందుతున్నారు. మండలంలో అధికారులు వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

8,935 జాబ్‌కార్డులు

పాణ్యం మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మొత్తం 8,935 జాబ్‌కార్డులు ఉన్నాయి. 2024–25 ఏడాదికి సంబంధించి లేబర్ బడ్జెట్‌ను రూ.2.84 లక్షల చొప్పున తయారు చేశారు. వీటి ఆధారంగా పనులు చేపడుతున్నారు. ప్రతి రోజు మండలంలో 4 వేల మంది ఉపాధి పనులను వినియోగించుకుంటున్నారు. ఒక్కో కూలీకి కనీస వేతనం రూ. 238లు చొప్పున అందుతోంది.

వ్యవసాయ అనుబంధ పనులు..

ఉపాధి పనులకు సంబంధించి ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు గతేడాది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. ముఖ్యంగా మండలంలో అధికంగా ఆయకట్టు కింద సాగుభూమి ఉన్న నేపథ్యంలో అధికారులు వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. పంట కాల్వలు శుభ్రం చేయడం, సాంప్రదాయ నీటి కుంటలు శుభ్రం చేయడం, పొలాల రస్తాలు, రోడ్లకు మరమ్మతులు చేయడం లాంటి పనులకు మొదటి ప్రాధాన్యతగా ప్రణాళికలను రూపొందించారు. అనుమతులు రాగానే అధికారులు ఆయా గ్రామాల్లో పనులను ప్రారంభించారు.

కూలీల్లో అవగాహన పెంచాం

ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డులు పొందిన ప్రతి ఒక్కరూ పని దినాలను ఉపయోగించుకోవాలని సూచించాం. అంతేకాక ప్రతి రోజు ఈ పని ద్వారా వారికి వచ్చే వతనం గురించి కూడా తెలియజేశాం. ఉన్నతాధికారుల ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి కూలీలకు సూచనలిచ్చాం . వ్యవసాయ పనులు ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాం. మేటీల సహాయంతో కొలతలు ఇచ్చి కనీస వేతనం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. గతేడాది ఇచ్చిన ప్రతిపాదనలను వందశాతం పూర్తి చేస్తాం.

– విజయరాణి, ఏపీఓ.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కల్లూరు : మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఏబిఎం చర్చి 17వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం కమిటీ సభ్యులు, నిర్వాహకులు కిరణ్‌కుమార్, ఏసురాజు, రమేష్, నడిపి చెన్నయ్య, సుధాకర్, లాజర్, గుండన్న, దేవదానం, శిరీష, బతున్న, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓపెన్ కబడ్డీ, ఎద్దుల బండులాగుడు పోటీలను నిర్వహించారు. ఆయా పోటీలను కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు సత్యంరెడ్డి ప్రారంభించారు. మధ్యాహ్నం కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎద్దులు పోటీల్లో విజేతలైన ఎద్దుల యజమానులకు దాతల ఆధ్వర్యంలో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పటిష్టంగా చేపట్టాలి



ఆలయ మహా ప్రాకరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాణ్యం : ఆలయాలల్లో నిర్మాణాలు పటిష్టంగా చేపట్టాలని విజయవాడ దేవదాయ శాఖ ఇంజినీరింగ్ కార్యాలయ అధికారులు, సహాయ కమిషర్ జ్యోతి, ఈఈ గంగయ్య, ఏఈ ఉమాచౌదరి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న ప్రత్యేక షెడ్లు, మహాప్రాకారం , విడిదిగదులు తదితర నిర్మాణాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సీ.జీఎఫ్ నిధుల, భక్తుల సహకారంతో చేపడుతున్న నిర్మాణాలు పటిష్టంగా ఉండాలన్నారు. అలాగే ఆలయ చరిత్రను తెలియజేసేలా డిజైన్‌లు ఉండాలన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రామకృష్ణ, డ్రాఫ్ట్ మెన్ రవి, కర్నూలు ఏఎస్ఈ సతీష్, సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ

కోడుమూరు రూరల్: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో ఎవరైనా గొడవలకు దిగినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కొండపేట, పెద్దబోయగేరి, బీసీ కాలనీల్లో ఎస్ఐ బాలనరసింహులు, సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించి అనుమానితులు, రౌడీషీటర్ల ఇళ్లలో సోదాలు చేశారు. సీఐ మాట్లాడుతూ అనసవరమైన విషయాలకు అల్లర్లకు దిగితే కేసులు నమోదు చేసి జైలు పంపుతామని, ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

నాటు సారా బట్టీ ధ్వంసం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం ఎల్. బండ త ండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటు సారా బట్టీపై సిబ్బందితో దాడి చేసి 1,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ స్క్వాడ్ సీఐ నరసనాయుడు, సిబ్బంది శంకర్‌నాయక్, గోపాల్ నాయక్, వెంకట్రాముడు, కరుణాకర్, షేక్షావలి పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలి

కల్లూరు : కల్లూరు అర్బన్ పరిధి 28వ వార్డు పందిపాడులో నీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి గ్రామంలో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ హంద్రీనదిలో నీరు ఉన్నప్పటికీ గ్రామంలో నీళ్లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.



రోడ్డుపై బైఠాయించిన పందిపాడు ప్రజలు

23న బండలాగుడు పోటీలు



ఆరాధన మహోత్సవానికి సిద్ధమైన ఆలయం

కల్లూరు: మండల పరిధిలోని పందిపాడు గ్రామం శివన్న తోట వద్ద వెలసిన శ్రీ శ్రీ శ్రీ పూల శంకరయ్య 47వ ఆరాధన మహోత్సవం సందర్భంగా ఈ నెల 23న బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో విజేతలైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. గ్రామ పెద్దలు, పూల హనుమన్న బ్రదర్స్ ఆధ్వర్యంలో చెక్క భజన, నందికోల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

గడివేముల: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ హేమసుందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్ల పచ్చిరొట్టె ఎరువు (జీలుగ) మంజూరైనందన్నారు. కిలో రూ.88 ఉండగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రూ.34 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్: జులకల్ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దిల్షాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి తీర్ణులైన విద్యార్థులు ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొత్తూరులో కలెక్టర్ సతీమణి పూజలు



కలెక్టర్ సతీమణి నళినికి తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు సతీమణి నళిని సోమవారం పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించుకున్నారు. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి దర్శనమనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ నాగలింగేశ్వరస్వామి వారికి పూజలు చేశారు.

వేగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు



వక్కెర వాగుపై వేగంగా జరుగుతున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు

కల్లూరు: మండల పరిధిలోని నెరవాడ గ్రామం వద్ద వక్కెర వాగుపై నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వక్కెర వాగు పొంగి ప్రవహిస్తే గ్రామంలోని ప్రజలు కర్నూలు, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామస్తుల ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. బ్రిడ్జి పూర్తయితే ఎంత భారీ వర్షం కురిసినా పాఠశాలలకు, ఇతర పనుల నిమిత్తం కర్నూలు వెళ్లేందుకు వీలవుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.